క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



కలశాలలతో ఆలయం వద్దకు వెళ్తున్న మహిళలు

వంగర: మండలంలోని కొప్పర గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తొలిరోజు ఏపీ సాధుపరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానందస్వామి ఆధ్వర్యంలో మంత్ర పుష్పము, యాగశాల పూజ, ప్రతిష్ఠ సంకల్పం, కలశాలలతో ఊరేగింపు తదితర కార్యక్రమాలు చేపట్టారు.

ఆకట్టుకున్న చలివేంద్రం సెట్



విద్యుత్ కాంతులీనుతున్న చలివేంద్రం సెట్

బాడంగి: మండలంలోని గజరాయునివలస గ్రామంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. హిమాలయ చలివేంద్రం పేరిట సరికొత్తగా వేసిన చలివేంద్రం సెట్ పలువురిని ఆకట్టుకుంటోంది.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు



బోరు బాగు చేస్తున్న దృశ్యం

రాజాం: మండలంలోని లక్ష్మీపురంలో పాడైన తాగునీటి బోర్లు మరమ్మతులు శనివారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో పలు బోర్లు బాగు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం గ్రామస్తులకు తాగునీటి పొదుపుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



చిన్నారులకు టీకాలు వేస్తున్న ఏఎస్ఎం ప్రభావతి

తెర్లాం: వ్యాధులు సోకకుండా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రతినెలా తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని తెర్లాం పీహెచ్సీ హెచ్‌వీ రాధమ్మ, ఏఎస్ఎం ప్రభావతిలు సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5లో వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తెర్లాం-2 సచివాలయం పరిధిలోని గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు



వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: ఉపాధి వేతనదారులకు కనీస వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేపట్టాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పెనుబాక గ్రామ బట్నవాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన శనివారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. తప్పుడు మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.307 వస్తుందన్నారు.

కాకతీయుల ఇలవేల్పు కాకతి



మాట్లాడుతున్న రంగనాథం

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామంలో రాజరాజేశ్వరీదేవి(బాపనమ్మ)గా పూజలందుకుంటున్న అమ్మవారు కాకతీయుల ఇలవేల్పు కాకతి అని రాజాం చరిత్రపరిశోధకుడు గార రంగనాథం తెలిపారు. అదే గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన రాజరాజేశ్వరీదేవి వార్షికోత్సవ ముగింపు సభకు ఆయన హాజరై ప్రసంగించారు. ఓరుగల్లును పాలిస్తున్న కాకతీయులు 13వ శతాబ్దం ప్రారంభంలో వంశధార నది వరకు జయించడంతో ఈ ప్రాంతాన్ని 10 సంవత్సరాల పాటు పాలించారన్నారు. కాకతిని చాముండేశ్వరిదేవిగా ఆనాటి ప్రజలు కొలిచేవారని, ఆ అమ్మవారిని పొగిరిలో ప్రతిష్ఠించి పూజలు చేసేవారన్నారు. అనంతరం రంగనాథంతో పాటు రచయిత ఉరిటి గున్నేశ్వరరావు, చిత్రకారుడు వంజరాపు సత్యం, తొలిపూజారి లాభాన కన్నం నాయుడులను ఘనంగా సత్కరించారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించి, తమ సత్తా చాటారు. కొన్ని కాలేజీల్లో శత శాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. అత్యుత్తమ స్కోరింగ్‌తో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

- కొనసాగిన ప్రభుత్వ కళాశాలల హవా
- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు
- కొన్ని కాలేజీల్లో శతశాతం ఉత్తీర్ణత నమోదు
- విద్యార్థులకు ఉపాధ్యాయుల అభినందనలు



బొబ్బిలి: విజయ సంకేతం చూపిస్తున్న కేజీబీవీ విద్యార్థినులు, ప్రిన్సిపాల్ స్వప్న



బి.శ్రీనిధి (ఎంపీసీ 961) | సీహెచ్ జగదీశ్వరి (బైపీసీ 959) | ఆర్.హరీష్ (సీఈసీ 856) | బి.తరుణి (ఎంపీసీ 460) | వి.వరలక్ష్మి (బైపీసీ 426) | ఆర్.భానుమతి (సీఈసీ 378) | బి.షర్మిల (బైపీసీ 963) | ఆర్.హారిక (బైపీసీ 929) | కె.సంధ్య (బైపీసీ 907)



ఎస్.షర్మిల (బైపీసీ 414) | ఎన్.మోహిని (బైపీసీ 388) | అరుణ (బైపీసీ 808) | లావణ్య (ఎంపీసీ 429) | ప్రవళిక (బైపీసీ 949) | ఎం.మణికంఠ (ఎంపీసీ 917) | బి.ప్రమీల (ఎంపీసీ 964) | టి.శ్రీవాణి (బైపీసీ 963) | జి.శ్రావ్య (ఎంపీసీ 437)



ఎల్.రాజేష్ (సీఈసీ 881) | బి.హేమంత్ (ఎంఈసీ 411) | ఎ.మహాలక్ష్మి (947) | పి.జాన్సీ (474)

తెర్లాం: మండలంలోని పెరుమాళిలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ సెకండియర్‌లో 81 మందికి 80 మంది, ఫస్టియర్‌లో 94 మందికి 89 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి శనివారం తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థుల్లో ఎంపీసీలో బి.శ్రీనిధి 961 మార్కులు, బైపీసీలో సీహెచ్ జగదీశ్వరి 959 మార్కులు, సీఈసీలో ఆర్.హరీష్ 856 మార్కులు సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో బి.తరుణి 460 మార్కులు, బైపీసీలో వి.వరలక్ష్మి 426 మార్కులు, సీఈసీలో ఆర్.భానుమతి 378 మార్కులు సాధించారు.

రామభద్రపురం: మండలంలోని బూసాయవలస కేజీబీవీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 33 మందికి గాను 33 మంది, ప్రథమ సంవత్సరం విద్యార్థినుల్లో 33 మందికి గాను 32 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ బైపీసీలో బసవ షర్మిల 963, రాంబార్కి హారిక 929, కిల్లాడ సంధ్య 907 మార్కులు సాధించారు. అలాగే ఫస్టియర్ బైపీసీలో సనపతి షర్మిల 414, ఎస్.మోహిని 388 మార్కులు సాధించారు.

బొబ్బిలి: స్థానిక కేజీబీవీ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 38 మంది విద్యార్థినుల్లో 31 మంది.. 28 మంది రెండో సంవత్సరం విద్యార్థినుల్లో 24 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ ఎంపీసీలో ఈదిబిల్లి రాజేశ్వరి 909 మార్కులు, ఫస్టియర్‌లో పెద్దింటి నిహారిక 500 మార్కులకు 478 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.స్వప్న తెలిపారు.

బాడంగి: స్థానిక కేజీబీవీలో 22 మంది సెకండియర్ విద్యార్థులకు 22 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జి.హరిత తెలిపారు. అలాగే అంబేడ్కర్ గురుకులానికి సంబంధించి 15 మందికి 15 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ పి.నారాయణరావు పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 95 మందికి 82 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ విద్యార్థుల్లో కె.ప్రియాంక 960, డి.ఝాన్సీ 955, మీనాక్షి 941 మార్కులు సాధించారు.

రాజాం: పట్టణంలోని సారధి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థినులు శతశాతం ఉత్తీర్ణత సాధించగా, బైపీసీలో 78 శాతం, సీఈసీలో 75 శాతం ఉత్తీర్ణత లభించినట్లు ప్రిన్సిపాల్ కె.జనార్దన్ తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో అలమండ లావణ్య 429, బైపీసీలో కొమ్ము సంధ్య 345, సీఈసీ గ్రూపులో డబ్బాడ లావణ్య 315 మార్కులు సాధించారు. సెకండియర్ బైపీసీ గ్రూపులో పడాల అరుణ 808, ఫస్టియర్ ఎంపీసీలో 64 శాతం, బైపీసీలో 41 శాతం, సీఈసీలో 37 శాతం, హెచ్ఈసీలో 29 శాతం ఉత్తీర్ణత సాధించారు. గురవాం కేజీబీవీ ద్వితీయ సంవత్సర బైపీసీలో 82 శాతం, ప్రథమ సంవత్సరంలో 40 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సావిత్రి వెల్లడించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో పి.ప్రవళిక 949, ప్రథమ సంవత్సరంలో ఎ.రమ్య 380 మార్కులు సాధించినట్లు తెలిపారు.

వంగర: మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 109 మంది విద్యార్థులకు 73 మంది ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 107 మందికి 88 మంది ఉత్తీర్ణత సాధించారు. మడ్డువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ప్రథమ సంవత్సరంలో 68 మందికి 61 మంది ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 60 మందికి 60 మంది ఉత్తీర్ణత సాధించారు. వంగర కేజీబీవీలో ప్రథమ సంవత్సరంలో 31 మంది ద్వితీయ సంవత్సరంలో 33 మంది పరీక్షకు హాజరు కాగా శతశాతం ఉత్తీర్ణత సాధించారు.

రేగిడి: స్థానిక ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులానికి చెందిన మొదటి సంవత్సరం సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు చెందిన 28 మంది విద్యార్థులకు గాను 23 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 25 మందికి గాను 24 మంది ఉత్తీర్ణత చెందినట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఫస్టియర్ ఎంఈసీలో బిడ్డిక హేమంత్‌కు 411, సెకండియర్ సీఈసీలో లాస రాజేష్‌కు 881 మార్కులు వచ్చాయి. అలాగే దేవుదళ కేజీబీవీ సెకండియర్‌లో ఎ.మహాలక్ష్మి 947 టి.రామలక్ష్మికి 918 మార్కులు సాధించగా, ఫస్టియర్‌లో పి.జాన్సీ 474, పి.హాసిని 447 మార్కులు సాధించారు.

సంతకవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 145 మందికి 52 మంది, సెకండియర్‌లో 128 మందికి 70 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ భవాని తెలిపారు.

బొబ్బిలి: స్థానిక వాసు జూనియర్ కళాశాల సెకండియర్ విద్యార్థుల్లో ఎంపీసీలో చింత స్వప్న 986, బైపీసీలో ఎం.తనూష 970 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు శనివారం తెలిపారు. సెకండియర్‌లో 70 మంది విద్యార్థులకు 900కు పైబడి మార్కులు వచ్చాయని, ఫస్టియర్‌లో 60 మందికి 400కు పైగా మార్కులు వచ్చాయని పేర్కొన్నారు.

బొబ్బిలి: స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాల బైపీసీ ఫస్టియర్ విద్యార్థిని వి.తనూజ 432 మార్కులు, సెకండియర్ బైపీసీ విద్యార్థి పి.ఇంద్రాణి 980 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో వి.పూజిత 464, పి.సింధూజ 462 మార్కులు సాధించారు.

బొబ్బిలి: స్థానిక విద్వాన్ జూనియర్ కళాశాల విద్యార్థుల్లో ఫస్టియర్ ఎంపీసీలో వి.పూజిత 465, ఎన్.దీక్షత 465, ఎస్.జ్యోతిలక్ష్మి 464 మార్కులు సాధించగా, బైపీసీలో వి.శ్రావణి 427 సాధించారు. సెకండియర్ ఎంపీసీలో జి.మోహనరావు 988, బి.లీలారాణి 988, సీహెచ్ సుస్మిత 986 మార్కులు, బైపీసీలో ఎం.దీపిక 964 మార్కులు సాధించారు.



బొబ్బిలి: విద్యార్థి స్వప్నను అభినందిస్తున్న కరస్పాండెంట్ వాసుదేవరావు, ప్రిన్సిపాల్ వెంకటేష్

బీసీ రుణాల్లో అర్హులకు అన్యాయం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో కూటమి నేతల ఆదేశాలతో అధికారులు తలొగ్గి, అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో శనివారం మీడియాతో మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా ఇవ్వాల్సిన రుణాలను తమకు నచ్చిన వారికి కట్టబెట్టి ప్రహసనంలా మార్చేశారన్నారు. ఆన్‌లైన్‌లో వేలల్లో దరఖాస్తులు వచ్చినా రుణాలు ఇచ్చేది కొందరికే కావడం ఒక వంతైతే అవీ కూడా పప్పు బెల్లంలా పచ్చనేతలు పంచుకున్నారని ధ్వజమెత్తారు. నిరుద్యోగ యువత తమ కాళ్లమీద తాము నిలబడి స్వయం ఉపాధి సాధించేందుకు ఉద్దేశించిన రుణాలు అధికార పార్టీ నాయకులు పంచుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిబంధనల ప్రకారం అధికారులు, బ్యాంకు అధికారులు కలిసి ఇంటర్వ్యూలు చేసి అర్హులను గుర్తించి రుణాల మంజూరు చేయాల్సి ఉన్నా అలా జరగడం లేదన్నారు. నింబధనలకు పాతరేస్తూ కూటమి నేతలు చెప్పిన వారి పేర్లు జాబితా మాత్రమే బ్యాంకులకు పంపించారని ఆరోపించారు. ఎమ్మెల్యే చేబితేనే రుణాలు మంజూరు చేస్తామని నేరుగా అధికారులే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



వేతనదారులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్ద ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్2 గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, టి.గోవిందమ్మలు.. ప్రకృతి సేద్యం ద్వారా కలిగే ప్రయోజనాలను వేతనదారులకు వివరించారు. ప్రకృతి సాగులో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. అలాగే నేల సారవంతానికి ఎకరా పొలంలో 12 కిలోల నవధాన్యాలు వేసుకుని 45 రోజుల తర్వాత కలియదున్నుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దు



సీసీ ఫుటేజీ దృశ్యాలు పరిశీలిస్తున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలిరూరల్: మండలంలోని రాముడువలస గ్రామ బాపిస్ట్ చర్చి వద్ద ఆ చర్చి నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ సతీష్‌కుమార్ శనివారం పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్యమత ప్రచారాలు జరుగుతున్న దృష్ట్యా అన్ని మతాల ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరూ మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని సీఐ సూచించారు. నేరాల నియంత్రణలో ఉపయోగపడుతున్నాయన్న నేపథ్యంలో వీలైనంత మందితో ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీలో క్రీడాకారులు

సంతకవిటి: సంతకవిటి మండలం, జావాం గ్రామంలో అంతర్‌జిల్లా వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. పగడాలమ్మ జాతర మహోత్సవంలో భాగంగా జరుగుతున్న ఈ పోటీలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అరకు జిల్లాల వాలీబాల్ జట్లు హాజరై, సత్తా చాటుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఈ మ్యాచ్‌లు ఎంతో ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. జాతరకు వచ్చిన వారంతా ఈ పోటీలను చూసి ఆనందిస్తున్నారు.

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం

తెర్లాం: ప్రతిరోజూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధులు దూరమవుతాయని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని స్థానిక పీహెచ్‌సీ హెచ్‌వీ రాధమ్మ తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5లో ఆరోగ్య విషయాలపై శనివారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అలాగే క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు చేయించుకోవాలని గర్భిణులకు తెలిపారు. అనంతరం 1000 రోజుల కేర్‌పై అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవికి అవగాహన కల్పించారు.

వంగర: గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సన్యాసమ్మ సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని కోనంగిపాడులో గర్భిణులు, బాలింతల ఇళ్ల వద్ద పురుషులు ఆడవాళ్లకు ఇళ్ల పనుల్లో అందించాల్సిన సహాయ సహకారాలను తెలిపారు. చిన్నారులకు రెండేళ్ల వయసు వచ్చినంత వరకు జాగ్రత్తలు పాటించాలన్నారు.

దివ్యజీవన సత్సంగ సమావేశం

రేగిడి: ప్రతిఒక్కరూ రామతత్వం అలవర్చుకోవాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ సూచించారు. చైత్ర పూర్ణిమ పురస్కరించుకుని, స్థానిక దత్తపీఠంలో దివ్యజీవన స త్సంగ సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీరాముడు ఆదర్శ వ్యక్తిత్వం కలిగిన దేవుడన్నారు. రామాయణం ఒక మంచి కుటుంబ వ్యవస్థను తెలియజేస్తుందన్నారు.

మహిళలకు సహకారం అందించాలి



ర్యాలీలో అంగన్‌వాడీ సిబ్బంది

రాజాం సిటీ: అన్ని పనుల్లోనూ మహిళలకు పురుషులు సహకారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.శ్రీదేవి, రమాదేవి, విజయకుమారిలు కోరారు. ఇదే విషయమై స్థానిక పట్టణ పరిధిలోని మల్లిఖార్జునకాలనీ, లచ్చయ్యపేట ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు ఇంటి పనుల్లో పురుషులు సహాయం చేయాలని తెలిపారు. ప్రతిరోజూ వారు పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు.

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు

విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటైన ఆర్వో ప్లాంట్లు ప్రస్తుతం మూలకు చేరాయి. నాడు–నేడు పథకంలో భాగంగా గతంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బొబ్బిలి మండలంలో 82 చోట్ల వీటిని ఏర్పాటు చేసింది. అయితే ఇప్పుడు అవి నిరుపయోగంగా మారాయి. నిర్వహణ సరిగా లేక పనికిరాకుండా పోయాయి. చాలావరకు మరమ్మతులకు గురై వినియోగంలో లేని పరిస్థితి. వేసవిలో విద్యార్థుల దాహార్తి తీర్చాల్సినవి.. ఇలా దిష్టిబొమ్మల్లా ఉండడంతో ఇలా అయితే ఎలా అని అందరూ ప్రశ్నిస్తున్నారు. తక్షణమే వాటిని బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న వినియోగంలో లేని ఆర్వో ప్లాంట్లు.. బొబ్బిలి మండలంలోని నారాయణప్పవలస, చింతాడ పాఠశాలల్లోనివి.

– బొబ్బిలిరూరల్



పొలాలకు దారేదీ?

తమ పొలాలకు దారేదీ.. అని రాజాం పట్టణ పరిధిలోని సారధి గ్రామ రైతులు ప్రశ్నిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్‌లో నిర్మించిన గోడల కారణంగా తమ పొలానికి వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని వాపోతున్నారు. వివరాలిలా ఉన్నాయి.. రంగప్పచెరువు ఆయకట్టులోని రైతుల పొలాల దగ్గర ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న కొంతభూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి లేఅవుట్‌లు వేసి సరిహద్దు గోడలు నిర్మించారు. ఇవి అక్కడి పొలాలకు వెళ్లే రైతులకు అడ్డంకిగా మారాయి. గతంలో పొలాల నుంచి పంటను ఇంటికి, కళ్లాలకు తీసుకువెళ్లేందుకు రోడ్డు పక్కనే పొలాల గట్లు ఉండేవని, ఇప్పుడవి లేఅవుట్లు అయ్యాయన్నారు. ఈ గోడల కారణంగా చెరువు మదుముల నీరు దిగువ ప్రాంతాల పొలాలకు కూడా రాని దుస్థితి నెలకొందన్నారు. అధికారులే స్పందించి, తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– రాజాం



నేడు ఉచిత నేత్రవైద్య శిబిరం

బాడంగి: స్థానిక శివాలయం పక్కన ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత మెగా నేత్రవైద్య శిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు క్యాంప్ ఇన్‌చార్జ్ సీహెచ్ వెంకటరమణ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి యాజమాన్యం ఈ శిబిరం నిర్వహిస్తోందని, కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ శిబిరం సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నేత్ర శస్త్రచికిత్స అవసరమైన వారిని అదేరోజు ఆస్పత్రికి తరలించి, ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు మరో అవకాశం

రామభద్రపురం: కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ల్లో ప్రవేశాలకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఇదివరకు ఈ కళాశాల్లో అడ్మిషన్లకు ఇచ్చిన గడువు ముగియగా, ఇప్పుడు ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేస్తూ ఉత్తర్వులు జారీ కావడం విశేషం. బూసాయవలస కేజీబీవీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులంతా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దీప శనివారం తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బొబ్బిలి: శ్రీకాకుళం జిల్లా సాయుధ పోరాట యోధుడు పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి ఈ నెల 13వ తేదీన శ్రీకాకుళం జిల్లాలోని పలాసలో నిర్వహించనున్నారని, అందరూ ఈ కార్యక్రమానికి తరలిరావాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎం.గోపాలం కోరారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు హాజరు కానున్నారన్నారు.